సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 18 । నవంబర్ । 2024



ఆల్‌రౌండర్‌గా అదరహో

పూర్ణచంద్ర క్రికెటర్‌గా రాణిస్తున్నాడు. ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్నాడు.

- 8లో



ఇచ్చట పనిచేయలేం!

ఇచ్ఛాపురంలో పనిచేసేందుకు అధికారులు రావడం లేదు. కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- 8లో



గూడ్స్ రైలు ఎక్కి..

ఓ మతిస్థిమితం లేని వ్యక్తి గూడ్స్ రైలెక్కి విద్యుత్ తీగలు పట్టుకున్నాడు. తీవ్రంగా గాయపడ్డాడు.

- 8లో

న్యూస్‌రీల్

సొంతానికి గ్రామ సచివాలయం



మండపల్లి సచివాలయం సమావేశ మందిరంలో లైటింగ్, సౌండింగ్ సామగ్రి

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించాల్సిన గ్రామ సచివాలయాన్ని పరాయి వ్యక్తులు దర్జాగా సొంతానికి వాడుకుంటున్నప్పటికీ గ్రామ సచివాలయ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండపల్లి గ్రామ సచివాలయాన్ని రూ.లక్షల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం ఇందులోనే పాలనాపరమైన కార్యకలాపాలు జరుగుతున్నాయి. సమావేశ మందిరాన్ని మాత్రం పరాయి వ్యక్తులు లైటింగ్ అండ్ సౌండింగ్ సామగ్రిని భద్రపరిచేందుకు వినియోగిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎల్ఎన్ పేటలో ధాన్యం దొంగలు

ఎల్.ఎన్.పేట: మండలంలో ధాన్యం దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. శనివారం రాత్రి రెండు గ్రామాల్లో పలువురు రైతులకు చెందిన 52 ధాన్యం బస్తాలను దొంగిలించుకుని వెళ్లిపోయారు. ఈ మేరకు బాధిత రైతులు సరుబుజ్జిలి పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఖరీఫ్ వరిచేను యంత్రాల ద్వారా కోత కోసిన రైతులు ధాన్యం బస్తాలను రోడ్డు పక్కన వేసి ఉంచారు. అలా ఉంచిన ధాన్యం బస్తాలను శనివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లిపోయారని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని యంబరాం గ్రామానికి చెందిన పెనుమజ్జి ధర్మారావు అనే రైతు రోడ్డు పక్కన 37 బస్తాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచుకోగా వీటిలో 17 ధాన్యం బస్తాలు, అదే గ్రామానికి చెందిన దోమ దాలిరాజు, కళ్యాణ లక్ష్మీనారాయణ, యాళ్ల సింహాచలంలకు చెందిన ఆరేసి ధాన్యం బస్తాలు బొత్తాడసింగి గ్రామానికి చెందిన పిల్లి వరలక్ష్మికి చెందిన 10 బస్తాలు, జమ్మయ్య దొరకు చెందిన 8బస్తాలు దొంగిలిచుకుని వెళ్లిపోయారు. దొంగతనంపై సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తారాజువ్వలు పడి పూరిళ్లు దగ్ధం



కాలిపోతున్న ఇళ్లు


శ్రీకాకుళం క్రైమ్ : అరసవల్లి కాపువీధిలో తారాజువ్వలు పేడటంతో ఒకే వరుసలో ఉన్న మూడు పూరిళ్లు కాలిపోయాయి. ఈ ఘటనలో విలువైన సర్టిఫికెట్లు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యింది. సమాచారం తెలిసిన వెంటనే రెండు అగ్నిమాపక శకటాలతో వెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాదరావు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షలు ఆస్తినష్టం సంభవించిందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుకు 402 కేంద్రాలు

కోటబొమ్మాళి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంటను విక్రయించేందుకు జిల్లాలో 402 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సివిల్ సప్లై డీఎం కె.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ త్రినాథరావు అన్నారు. ఆదివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో 3,60,000 ఎకరాల్లో 2,90,000 మంది రైతులు వరి సాగు చేశారని, వీటి ద్వారా 4,90,000 క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 కిలోల ధాన్యం బస్తాకు రూ.1840లు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. అయితే రైతులు ధాన్యం నూర్చిన తర్వాత ఆరబెట్టి మిల్లులకు తీసుకువెళ్లాలని, మిల్లర్లు కూడా ధాన్యం కొనుగోలు చేసిన 15 రోజుల్లో మిల్లింగ్ చేసి ఎఫ్‌సీకి పంపించాలన్నారు. రైతులు నచ్చిన రైస్ మిల్లుకు తమ ధాన్యం తీసుకు వెళ్ల వచ్చునన్నారు. ధాన్యం మిల్లుకు తీసుకువెళ్లిన ఆరు గంటల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 48 గంటల్లో మీ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఎస్‌ఓ జి. సూర్యప్రకాష్‌రావు, డీసీఓ నగేష్, డీసీసీబీ సీఈఓ వరప్రసాద్, జీఎం జగదీష్, బీఆర్ బి.మురళీకృష్ణ, దేశం నేతలు బోయిన రమేష్, కర్రి అప్పారావు, నంబాళ శ్రీనివాసరావు, పట్ట సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

● నిరీక్షణ

ఫలించేనా..?



- డీఎస్సీ ఆశావహులతో ఆడుకుంటున్న ప్రభుత్వం
- డీఎస్సీ ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పని వైనం
- తాజాగా శాసనమండలిలో మంత్రి లోకేష్ వ్యాఖ్యలతో అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ

శ్రీకాకుళం న్యూకాలనీ:

టీచర్ ఉద్యోగాలంటే సిక్కోలు యువతకు ఎనలేని ఆసక్తి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని సర్కారీ బడుల్లో పనిచేస్తున్న టీచర్లలో మెజారిటీ ఉపాధ్యాయులు సిక్కోలు వాసులే. ప్రస్తుతం మాత్రం డీఎస్సీ ఆశావహులతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోంది. ఈ నెల రెండో వారంలో నోటిఫికేషన్ వెలువడుతుందని డీఎస్సీ అభ్యర్థులందరూ భావించారు. అందుకు విద్యాశాఖ సైతం కసరత్తు చేస్తున్నట్టు ప్రకటించింది. ఎప్పటిలాగే డీఎస్సీ తాత్కాలికంగా వాయిదా పడిందని చల్లని కబురొచ్చింది. నోటిఫికేషన్ వెల్లడిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

మొదటి సంతకానికి మంగళమేనా..?

డీఎస్సీ రాయాలకునే వారిని ఎప్పటిలాగే చంద్రబాబు వంచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తన నైజాన్ని చూపారు. సీఎంగా ప్రమాణ స్వీకారం అనంతరం మొదటి సంతకం పేరిట నిరుద్యోగులను బురిడీ కొట్టించారు. సాకులు చెబుతూ నోటిఫికేషన్ వాయిదా వేస్తూ వస్తుండటంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. జిల్లాలో డీఎడ్, బీఎడ్, ఇతరత్రా ఉపాధ్యాయ కోర్సులు చేసినవారు లక్షన్నర మంది వరకు ఉన్నారు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక తూతూమంత్రంగా పోస్టులు చూపించి భర్తీ చేస్తామన్నారు. ఏదో ఒక సాకు చెబుతూ వాయిదాల మీద వాయిదాలు వేస్తూ వస్తున్నారు. త్వరలో నోటిఫికేషన్ వస్తోందంటూ విద్యాశాఖ అధికారులు సైతం లీకులిస్తూ వచ్చారు. తాజాగా న్యాయపరమైన వివాదాలు పరిష్కరించాకే ప్రకటన ఉంటుందని విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్పడంతో అభ్యర్థులంతా కంగుతిన్నారు. డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తున్నవారి ఆశలపై నీళ్లు చల్లినట్టయ్యింది.

అన్నీ వదులుకుని.. కోచింగులకు వెళ్లి

చిన్నాచితకా ఉద్యోగాలు చేసుకుంటూ ఒక పక్క కోచింగ్, మరో పక్క కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ ఎలాగోలా డీఎస్సీకి ఎంతోమంది సన్నద్ధం అవుతున్నారు. గత ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో మే నెల నాటికి ప్రక్రియ పూర్తి.. జూన్‌లో పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉద్యోగాల్లో ఉంటామన్న ఆశతో లక్షల మంది అభ్యర్థులు ప్రైవేట్ ఉద్యోగాలను వదిలేసి శిక్షణ పొందుతున్నారు. ఒక పక్క నెల రోజులు, రెండు నెలలు సెలవులు పెట్టి మరీ డీఎస్సీ కోచింగుకు వెళ్తున్నారు. ఇప్పటికే ఏడాది కాలంగా ఆర్థికంగా నష్టపోయామని అభ్యర్థులు వాపోతున్నారు. ఆగస్టు చివరి నుంచి సెప్టెంబరు, అక్టోబర్ వరకు టెట్ నిర్వహించింది. ఇటీవలే ఫలితాలు కూడా వచ్చాయి. ఇక అందరూ ఎంతో ఆశగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ప్రభుత్వ తాజా ప్రకటనలు వారిని నిద్రపట్టనీయడం లేదు. ఎస్సీ రిజర్వేషన్లు వచ్చాకే డీఎస్సీ నోటిఫికేషన్ అని ఒక రోజు, న్యాయపరమైన చిక్కులు లేకుండా ఉండేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని మరోసారి, వచ్చే విద్యాసంవత్సరం జూన్, జూలైకల్లా ఉద్యోగాలు ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి లోకేష్ చెబుతుండటం వంటి క్లారిటీ లేని వ్యాఖ్యలతో వారంతా దిగులు చెందుతున్నారు.



శిక్షణ కేంద్రంలోలో క్లాసులకు హాజరైన డీఎస్సీ అభ్యర్థులు

ఖాళీలు ఇలా...

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 3265 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13,243 మంది టీచర్లు పనిచేస్తున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో 543 ఖాళీలు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వీటిలో 144 సెకండరీ గ్రేడ్ టీచర్లు, 399 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. అయితే 2025 డిసెంబర్ వరకు ఏర్పడే ఖాళీలను అనుసరించి డీఎస్సీ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియలో భాగంగా మరో 420 పోస్టుల వరకు పెరగవచ్చని భావిస్తున్నారు.



ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం



డీఎస్సీ నోటిఫికేషన్‌ను వాయిదా వేయకుండా వెంటనే ప్రకటించాలి. నోటిఫికేషన్ వాయిదా పడటం వల్ల ఆర్థికంగా ఎంతో ఇబ్బందిపడుతున్నాం. ఎన్నో అవకాశాలను వదులుకుంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాం.

– పి.గోవిందరావు, టెట్ క్వాలిఫైడ్, డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థి

నోటిఫికేషన్‌ను ప్రకటించాలి



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలి. నాతోపాటు నా భార్య లలిత కూడా డీఎస్సీకి సన్నద్ధమవుతోంది. కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లలో ఉంటూ చదివిపిస్తున్నాను. చాలా ఖర్చులతో సతమతమవుతున్నాం. వాయిదా వేయకుండా త్వరగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని విన్నవిస్తున్నాం. – కొయ్యాన రామారావు, టెట్ క్వాలిఫైడ్, డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు 41ఎ నోటీసులు

టెక్కలి: టెక్కలి మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఆదివారం టెక్కలి పోలీసులు 41ఎ నోటీసులు జారీ చేశారు. 2022 సంవత్సరంలో టెక్కలిలో జనసేన పార్టీ కార్యాలయంపై దాడి జరిగింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే దాడి చేశారని ఆరోపిస్తూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో జనసేన పార్టీ కార్యాలయం పై దాడి జరిగిన సందర్భంలో జై ఉత్తరాంధ్ర అంటూ కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు నినాదాలు చేయడం వినిపించిందంటూ స్థానికులు వెల్లడించారు. అప్పటి ఫిర్యాదు ఆధారంగా ఇప్పుడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ నోటీసులు జారీ చేయడం కేవలం కక్ష పూరితమైన చర్యలు అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెక్షన్ 448, 427, రెడ్ విత్ 34 ఐపీసీ ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు బాధిత కార్యకర్తలు పేర్కొన్నారు. నోటీసుల ప్రాప్తికి త్వరిత గతిన తదుపరి విచారణకు సిద్ధంగా ఉండాలని ఆ నోటీసులో వెల్లడించారు.

ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ వికేంద్రీకరణ



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)ను సోమవారం నుంచి మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

అపురూపంగా బాలియాత్ర

- వంశధార తీరానికి పోటెత్తిన భక్తులు
- సాయంత్రం నుంచి రాత్రి వరకూ దీపోత్సవం



ఖారవేల ఘాట్‌లో దీపాలు విడిచిపెడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ విజయ, రమణి, సుగుణమ్మ తదితరులు



నదికి నమస్కరించి దీపాలు విడిచిపెడుతున్న సీతారాం, రవికుమార్, తిలక్ తదితరులు



దీపాలతో నదికి తరలివెళ్తున్న భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బాలియాత్ర అపురూప రీతిలో సాగింది. యాత్ర సందర్భంగా వంశధార నది తీరం భక్త జనసంద్రమైంది. సాయంత్రం ప్రారంభమైన ఈ యాత్ర రాత్రి వరకూ కొనసాగింది. పూర్ణ కుంభంతో బాలి యాత్ర ప్రారంభం చేశారు. అర్చకులు, పురోహితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ మంగళహారుతులిస్తూ స్వామిని కీర్తిస్తూ వంశధార నదికి చేరుకున్నారు. దీనికి ముందు బాలి యాత్ర చరిత్ర, కళింగ రాజ్యం స్థాపన, నాటి పరిపాలన, నౌకాయానం తదితర విషయాలను నిర్వాహక కమిటీ ప్రతినిధి దువ్వాడ జీవితేశ్వరరావు భక్తులకు మైకులో వివరించారు. అనంతరం భక్తులు నదిలో అరటి దొప్పలపై దీపాలు విడిచిపెట్టారు.

ముందుగా జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి, స్థానిక ఎమ్మెల్యే బగ్గు ఎమ్మెల్యే రమణ మూర్తి సతీమణి సుగుణమ్మలు ఖారవేల ఘాట్‌లో దీపాలు విడిచిపెట్టారు. అనంతరం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పేరాడ తిలక్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్‌లు కూడా దీపాలు విడిచిపెట్టారు. అర్చకులు నదికి నక్షత్ర,కుంభ,అష్టాదశ హారతులిచ్చారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ యాత్రను ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని స్థానికులు కోరారు. ఒడిశాలో అధికారికంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కె.హరి ప్రసాద్, ఎం.బసవ వెంకట రమణ, ఎం.శ్యామలరావు తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గుండె చెరువైంది



- పుట్టిన రోజు నాడే చనిపోయిన బాలుడు
- కలువ పూల కోసం వెళ్లి చెరువులో మునిగిపోయిన చిన్నారి

శ్రీకాకుళం రూరల్:

పుట్టిన రోజు నాడే ఆ పిల్లాడి ఆయువు తీరిపోయింది. బర్త్ డే వేడుకలు జరగాల్సిన ఆ ఇంటిని మృత్యు దేవత నిశ్శబ్దం చేసేసింది. కలువ పువ్వులతో ఆడుకుందామని ఆశ పడిన పిల్లాడిని చెరువు మింగేసింది. మండల పరిధిలోని గూడేం పంచాయతీ రామనర్సయ్యపేట గ్రామంలో ఆదివారం జరిగిన ఈ ఘటనతో ఊరి గుండె చెరువైంది. గ్రామంలో ముల్లి రాజు దంపతుల చిన్నకుమారుడు సోమశేఖర్(7) ఆదివారం పుట్టిన రోజు వేడుకలకు సిద్ధమయ్యాడు. సాయంత్రం వరకు తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ స్థానికంగా ఉన్న చెరువులో కలువ పూవులు కోద్దామని సరదా పడ్డాడు. చెరువులో దిగి పడిపోయాడు. దీన్ని చూసిన తోటి పిల్లలు కేకలు వేస్తూ గ్రామస్తులకు సమాచారం అందించారు. వారందరూ వచ్చి తీసేలోగా అప్పటికే బాలుడు ప్రాణాలు వదిలేశాడు. ఈ కుర్రాడు రెండో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ కూలీలు. కుమారుడి పుట్టిన రోజు వేడుక చేసుకునేందుకు సిద్ధమవుతుంటే.. చావు వార్త చెవిన పడడంతో వారు తల్లడిల్లిపోయారు. పిల్లాడి మృతితో గ్రామమంతా విషా ద ఛాయలు అలముకున్నాయి. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో కార్తీక పూజలు



ఇంద్రపుష్కరిణిలో పూజలు చేస్తున్న భక్తులు

అరసవల్లి: కార్తీక మాసం మూడో ఆదివారం సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర జిల్లాల నుంచి ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. పవిత్ర ఇంద్రపుష్కరిణిలో స్నానాలు చేసి కార్తీక దీపారాధన చేసారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు ప్రత్యేక, విశిష్ట, ఉచిత దర్శనాల క్యూలైన్లలో బారులు తీరగా, 10 గంటల నుంచి ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరిగిపోయింది. దీంతో ఆలయ సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సజావుగా దర్శనాలు అయ్యేలా చర్యలు చేపట్టారు. ఆలయ ఈఓ వై.భద్రాజీ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఒక్క రోజులో రూ.9,02,772 వరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.4,21,200, విరాళాలు ప్రత్యేక పూజల ద్వారా రూ.1,66,572, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.15 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా చలో శ్రీకాకుళం



చలో శ్రీకాకుళం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

టెక్కలి: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న చలో శ్రీకాకుళం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోరాట కమిటీ ప్రతినిధులు బోకర నారాయణరావు, చల్లా రామారావు పేర్కొన్నారు. ఆదివారం టెక్కలిలో పోస్టర్ ఆవిష్కరించారు.

ఎస్సీ, ఎస్టీల వ ర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పుపై రాష్ట్రపతి స్పందిస్తూ తక్షణమే రద్దు చేసే విధంగా చూడాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎ.రా హుల్, కె.కామేశ్వరరావు, కె.దాలయ్య, తారక్, జె.బాబురావు, లోకనాథం, సంజీవరావు, చిన్నవా డు, చంద్రశేఖర్, కసవయ్య, సూర్యనారాయణ, శ్రీనివాస్, పి.దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

స్టోర్ రూమ్‌లుగా అంగన్‌వాడీ కేంద్రాల మరుగుదొడ్లు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి-1వ, 6వ అంగన్‌వాడీ కేంద్రాల్లోని మరుగుదొడ్లను స్టోర్ రూంలుగా నిర్వాహకులు వినియోగిస్తున్నారు. గత కొంతకాలంగా మూడు మరుగుదొడ్ల బేసిన్లు పగిలిపోయాయి. తలుపులు కూడా విరిగిపోయాయి. నీటి సరఫరా లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటిని బాగు చేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకురాకుండా స్టోర్ రూమ్‌లుగా వాడుతున్నారు. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

● విహారం



అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. కార్తీక మాసం వనభోజనాల సీజన్ కావడంతో ఒడిశా రాష్ట్రంలో గల పలు ప్రాంతాలతో పాటు టెక్కలిపట్నం, పలాస, కాశీబుగ్గ, గొప్పిలి, పరిసర గ్రామాల నుంచి పర్యాటకులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి తీరానికి వచ్చి సేద తీరారు. – వజ్రపుకొత్తూరు రూరల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉయ్యాల వంశీకృష్ణ(24) మృతి చెందగా.. అతని బావ కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బలరాంపేటకు చెందిన వంశీకృష్ణ పట్టణంలోని ఊర్వసి రెడీమేడ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం కావడంతో వంశీ బరంపురం వెళ్లి అతని బావ కృష్ణను కలిశాడు. అక్కడి నుంచి ఇద్దరూ స్కూటీపై ఇచ్ఛాపురం బయల్దేరారు. ఈ క్రమంలో పట్టణంలోని పాత జాతీయ రహదారిపై గల కార్ గ్యారేజ్ సమీపంలో ఓ కంటైనర్ లారీ వీరి బండిని ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 సాయంతో వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బావమరిది వంశీ మృతి చెందగా కృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనను బరంపురం తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు

పొందూరు: పొందూరు హైస్కూల్, జూనియర్ కళాశాలలో 1975–76 పదో తరగతి, 1976–78 ఇంటర్మీడియెట్ చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో ఉత్సాహంగా జరిగింది. 48 ఏళ్ల తర్వాత ఒకే చోట కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో తమకు భౌతిక శాస్త్రాన్ని బోధించిన డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖర్‌రావు దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో టీడీపీ నేతల దాడికి గురై పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ వర్గీయులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. ఈ ఘర్షణలో ఇద్దరు మహిళలు, యువకుడు గాయాలపాలవడంతో రెండు రోజులుగా పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 2023లో మంచినీళ్లపేట పర్యటనకు వచ్చిన గౌతు శిరీషను నీలమ్మ, లక్ష్మమ్మ, చిన్నారావులు నిలదీశారనే కక్షతో వారిపై కక్ష పెట్టుకుని దాడులకు తెగబడ్డారని బాధితులు తెలిపారు.

ఉపాధ్యాయులను కించపరచడం తగదు



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి: అపార్ నమోదు సమస్యల విషయంలో ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ కించపరిచేలా ఆర్డీఓ వ్యాఖ్యలు చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా, మండల ప్రతినిధులు కె.దాలయ్య, పి.గణపతిరావు, ఇతర సభ్యులు మండిపడ్డారు. ఆదివారం టెక్కలిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో ప్రధానోపాధ్యాయులు ఇస్తున్న సర్టిఫికెట్లను ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. ఈ నెల 24 నుంచి మందసలో జరగనున్న స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ్ గౌరీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు, ప్రతినిధులు టి.వైకుంఠరావు, పి.ధర్మారావు, డి.పాపారావు, అరుణ్‌కుమార్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, కృష్ణారావు, చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ ఇంట్లో చోరీ

నరసన్నపేట: మండలంలోని రావాడపేట జగనన్న కాలనీలో బైక్ మెకానిక్ ముంగి శాంతారావు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. రూ.లక్షా 95 వేలు నగదు చోరీ చేశారు. ఈ మేరకు శాంతారావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వెళ్లిన శాంతారావు తిరిగి నరసన్నపేట వచ్చారు. మళ్లీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వెళ్లగా తాళాలు తీసి ఉండటాన్ని గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువా, పెట్టెలు తెరిచి ఉన్నాయి. వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దాచుకున్న రూ.1.95 లక్షలు కనిపించలేదు. బంగారు ఆభరణాలు మాత్రం యథావిధిగా ఉన్నాయి. వెంటనే నరసన్నపేట పోలీసులకు సమాచారం అందించగా.. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్‌లు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదివారం తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దు



నిరసన తెలుపుతున్న నాయకులు

కాశీబుగ్గ: విశాఖలోని స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతృత్వంలో పలు ప్రజా సంఘాల నాయకులు నినదించారు. ఈ మేరకు ఆదివారం కాశీబుగ్గ బస్టాండ్‌లో గాంధీ విగ్రహం వద్ద కరపత్రాల ఆవిష్కరించారు. పోస్ట్‌కార్డు ఉద్యమ ఆవశ్యకతను వివరిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నాయకుడు చౌదరి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, మద్దిల రామారావు, ఢిల్లీరావు, నీలకంఠం, రాపాక చిరంజీవులు, శ్రీకాంత్, నాగమణి, జ్యోతి, రొయ్య నాగరాజు, పాపారావు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌రౌండర్‌గా అదరహో..



మొదలవలస పూర్ణచంద్ర

- సిక్కోలు భవిష్యత్ ఆశాకిరణం ఎం.పూర్ణచంద్ర
- ప్రతిష్టాత్మక కుచ్‌బిహార్ అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీలో రాణింపు
- ఏసీఏ అండర్–19 జట్టులో ఉత్తమ ప్రతిభ
- ఇప్పటికే అండర్–12, 14, 16, 19 విభాగాల్లో ఆంధ్రా జట్టుకు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు కుర్రాడు మొదలవలస పూర్ణచంద్ర క్రికెట్‌లో సత్తాచాటుతున్నాడు. పరిపూర్ణవంతమైన క్రికెటర్‌గా రాణిస్తున్నాడు. అటు బౌలింగ్ ఇటు బ్యాటింగ్‌లో అదరహో అనిపిస్తున్నాడు. ఇటీవల బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ రాష్ట్ర కుచ్‌బిహార్ ట్రోఫీ అండర్–19 బాలుర మల్టీడేస్(టెస్ట్) క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన ఈ స్టార్ ఆల్‌రౌండర్ మెరుస్తున్నాడు. ముఖ్యంగా లెఫ్మార్మ్ స్పిన్నర్ కోటాలో యువ క్రికెటర్ చోటు దక్కించుకున్నాడు. ఆంధ్రా జట్టు మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాణించాడు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో ఈ మెగా టోర్నమెంట్ జరుగుతోంది. విదర్భ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రజట్లతో ఆంధ్రా తలపడనుంది.

అన్ని విభాగాల్లో ఆంధ్రా జట్టుకు..

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడేళ్లగా అండర్–12, 14, 16, 19 ఇలా అన్ని వయో విభాగాల్లోనూ ఆంధ్రా జట్టుకు పూర్ణచంద్ర ఎంపికవుతూ వస్తున్నాడు. రాష్ట్రటోర్నీలు, అంతర్ జోనల్, అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నీల్లో అవకాశం లభించిన అన్ని టోర్నీల్లోనూ అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో సత్తాచాటుతూ సెలక్టర్ల మన్ననలు అందుకుంటున్నాడు. అంతర్ జోనల్ టోర్నీలో 7 వికెట్లు పడగొట్టి బీసీసీఐ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ప్రసంశలు అందుకున్నాడు. రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మ్యాన్‌తోపాటు.. లెఫ్టార్మ్ ఆఫ్ స్పిన్నర్ కావడం పూర్ణచంద్రకు కలిసి వస్తోంది. పలుమార్లు ఒక ఇన్నింగ్స్‌లో ఐదేసికిపైగా వికెట్లు పడగొట్టి ఏసీఏ పెద్దలను ఆకట్టుకుంటున్నాడు. ఆ వయోవిభాగంలో ఆంధ్రా జట్టుకు అరుదుగా ఉన్న లెఫ్టార్మ్ స్పిన్నర్లతో ఈ సిక్కోలు యువకిరణం ఒకడు కావడం విశేషం.



బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌తో పూర్ణచంద్ర(ఫైల్)

తల్లిదండ్రులు, జెడీసీఏ ప్రోత్సాహంతో..

శ్రీకాకుళం నగరంలోని ఏఎస్ఎన్ కాలనీలో ఉంటున్న మొదలవలస లీలామోహన్, జ్యోతిలక్ష్మిల చిన్నకుమారుడు పూర్ణచంద్ర. తండ్రి వ్యాపారం చేస్తుండగా, తల్లి గృహిణి. ప్రస్తుతం ఈ యువ క్రికెటర్ శ్రీకాకుళంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు జిల్లా క్రికెట్ సంఘం బాసటగా నిలుస్తుండటంతో మరింతగా రాణిస్తున్నాడు. తాజాగా కుచ్‌బిహార్ క్రికెట్ టోర్నీకి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ రవికుమార్, సంఘ ప్రతినిధులు, కోచ్‌లు సంతోషం వ్యక్తంచేశారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికలు



స్విమ్మింగ్ క్రీడాకారులతో సంఘ ప్రతినిదులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వేదికగా ఆదివారం జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. ప్రతిభకనబర్చిన క్రీడాకారులను వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో విశాఖలో జరిగే రాష్ట్రపోటీలకు ఎంపికచేశారు. అంతకుముందు ఈ ఎంపికలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఝాన్సీ, సంఘ ప్రతినిధులు ఎస్.కాంతారావు, ఎన్ని సూర్యారావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలురు విభాగంలో పి.అవినీష్, వీడీ దరహాస్, పి.ప్రేమ్‌కుమార్, ఆర్.మోహన్, వై.టోని, ఎస్.ప్రణీత్, ఎం.మనోజ్, ఎం.నీలేష్, బి.హన్షుల్‌రాజ్, సీహెచ్. సుశాంత్, పి.సమీర్, కె.ధైర్య, జశ్వంత్. బాలికల విభాగంలో పి.చేతన, పి.యోచన, ఎం.పురంధరి, బి.సారాక్షి.

పంచారామాల బస్సులు సద్వినియోగం చేసుకోవాలి



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న డీఎంలు

శ్రీకాకుళం అర్బన్: కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాలైన పంచారామాలను సోమవారం ఒకేరోజు దర్శించుకునేలా ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు పిలుపునిచ్చారు. పంచారామాల బస్సులను శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పంచారామాల ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటల్లోని శివాలయాల దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 24 తేదీన కూడా పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. 17న ఒక్కరోజే శ్రీకాకుళం ఒకటవ డిపో నుంచి ఒక బస్సు, శ్రీకాకుళం రెండో డిపో నుంచి రెండు బస్సులు, టెక్కలి డిపో నుంచి ఒక బస్సు కలిపి మొత్తం నాలుగు బస్సులు బయలుదేరినట్లు తెలిపారు. 'ఒక్క ఫోన్ కాల్ తో మీ వద్దకు ఆర్టీసీ బస్సు' అనే నినాదంతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 9959225611 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, టెక్కలి అసిస్టెంట్ మేనేజర్ పీఎస్ఎన్ మూర్తి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, ప్రసాద్, ఎంపీ రావు, మురళి, ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, ప్రసాదరావు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



హర్షల్, హర్షిల్‌లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శ్రీకాకుళం న్యూకాలనీ:నగరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పీస హర్షల్ సాయిచరణ్, హర్షిత్ రామచరణ్ జాతీయ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి 28 వరకు నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియం వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. వీరి తండ్రి పీస గోవిందరాజు గార మండలం కొర్ని సర్పంచ్‌గా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా సేవలు అందిస్తున్నారు. వీరి ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, పీఈటీ పి.సాయికృష్ణ, నాగేంద్ర, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



నిరసనలో పాల్గొన్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శానిటరీ మేస్త్రిలపై చిన్నచూపు చూడటం తగదని, కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది చిరుద్యోగులపై ప్రతాపం చూపించడానికి కాదని ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఐదో రోజు ఆదివారం కూడా నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించిన శానిటరీ మేస్త్రిలను విధుల్లోకి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తప్పదన్నారు. మున్సిపల్ కార్మికులను సైతం పూర్తిగా విధుల్లోకి రాకుండా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు, ముద్దాడ రామారావు, కలగ జగదీష్, టొంపల షణ్ముఖరావు, మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, ఎస్.పార్థసారథి, ఆర్.గణేష్, రామచంద్ర, డి.రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

1016 మంది మహిళలతో..

సహస్ర సుందరకాండ పారాయణం



సహస్ర సుందరకాండ పారాయణం చేస్తున్న మహిళలు

- నిరాటంకంగా నాలుగు గంటల పాటు నిర్వహణ
- వండర్ బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రంతో నిర్వాహకులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సహస్ర సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం ఆద్యంతం ఆకట్టుకుంది. ఉదయం 9 గంటలకు ప్రారంభమై నిరాటంకంగా నాలుగు గంటల పాటు కొనసాగింది. నరసన్నపేటతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 1016 మంది మహిళలు హాజరై ఒకేసారి పారాయణం చేయడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఒకేసారి భారీ ఎత్తున కార్యక్రమంలో పాల్గొని పారాయణం చేయడంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని ప్రతినిధి రూప్‌నాథ్ తెలిపారు. ఈమేరకు శ్రీ లక్ష్మీ నరసింహ కోలాట భజన బృందానికి సర్టిఫికెట్ ఇచ్చామన్నారు. గతంలో ఇటువంటి పారాయణాలు జరిగినా ఏక బిగిన సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీషా పారాయణం రెండూ కలిసి జరగలేదన్నారు. లోక కల్యాణార్థం నిర్వహించిన స్థానిక సత్యనారాయణస్వామి ఆలయ అర్చకులు చామర్తి శ్రీనివాసాచార్యులు, వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు చామర్తి కృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోలక్ష్మీ కోలాట బజన బృందం, విశ్వహిందూ పరిషత్(నరసన్నపేట), వారణాశి సంతోషి, పూర్ణా నాగరాజు, వారణాశి రమేష్, కేఎల్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్‌రైలు ఎక్కి.. విద్యుత్ తీగను పట్టి..

- తీవ్ర గాయాలపాలైన మతిస్థిమితం లేని వ్యక్తి

సోంపేట : మండలంలోని బారువ రైల్వేస్టేషన్ పరిధిలో కొర్లాం వద్ద శనివారం రాత్రి మతిస్థిమితం లేని వ్యక్తి ఆగి ఉన్న గూడ్స్‌రైలు బండి ఎక్కాడు. విచిత్రంగా ప్రవర్తిస్తూ హైఓల్టేజ్ విద్యుత్ తీగను పట్టుకున్నాడు. షాక్ గురికావడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రాణపాయ స్థితిలో ఉండటంతో సాయం చేసేందుకు స్థానికులు ప్రయత్నించినా వారిపైనే దాడి చేయడంతో వెనక్కి వెళ్లిపోయారు. రైల్వే సిబ్బంది 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. సిబ్బంది చేరుకొని అతికష్టమ్మీద వాహనం లోపలికి తీసుకెళ్లగా వైద్య పరికరాలు కూడా ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడు. ఎట్టకేలకు పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. పలాస రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ముగిసిన జోనల్ స్పోర్ట్స్ మీట్



బహుమతులతో వియ్యంపేట గురుకుల క్రీడాకారిణులు



బహుమతులతో ఎచ్చెర్ల గురుకుల క్రీడాకారిణులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల/జూనియర్ కళాశాల జోన్–1 స్థాయి నాలుగు రోజుల స్పోర్ట్సు మీట్ ఆదివారంతో ముగిసింది. ఈ పోటీలకు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 21 పాఠశాలల నుంచి 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఓవరాల్ చాంపియన్‌షిప్, గేమ్స్ స్పోర్ట్సు చాంపియన్‌షిప్‌లను గురుగుబిల్లి గురుకుల పాఠశాల కైవసం చేసుకుంది. సీనియర్స్ వ్యక్తిగత చాంపియన్‌గా ఎ.లక్ష్మి (గురుగుబిల్లి) నిలిచింది. జూనియర్ విభాగంలో స్పోర్ట్సు చాంపియన్‌షిప్‌ను వియ్యంపేట, గేమ్స్ చాంపియన్‌షిప్‌ను పెద్దపాడు, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను వియ్యంపేట నిలిచాయి. జూనియర్స్ వ్యక్తిగత చాంపియన్‌గా జీవనప్రియ నిలిచారు. ముగింపు కార్యక్రమంలో శ్రీకాకుళం అంబేడ్కర్ గురుకులాల కో–ఆర్డినేటర్ బాలాజీ నాయక్, విశాఖపట్నం కో–ఆర్డినేటర్ రూపవతి, విజయనగరం పూర్వపు కో–ఆర్డినేటర్ బి.చంద్రావతి, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, ఎచ్చెర్ల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఇచ్ఛాపురం..

ఇచ్చట పనిచేయలేం!

- బదిలీపై వెళ్లిపోతున్న అధికారులు
- కూటమి నేతల ఆధిపత్య పోరే కారణం
- ఎంపీడీఓ, డీఈ, ఏపీఎం, కార్యదర్శుల పోస్టులు ఖాళీ



ఖాళీగా ఎంపీడీఓ కుర్చీ



రెండు నెలలుగా తెరుచుకోని పంచాయతీరాజ్ డీఈ గది

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా శివారు మండలమైన ఇచ్ఛాపురంలో పని చేసేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఇక్కడ పనిచేయడం కత్తిమీద సాములా మారిందని భయపడుతున్నారు. ధైర్యం చేసి వచ్చిన అధికారులు కూడా నెల తిరిగేలోపే ఏదో ఒక వంకతో ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఎన్నికల విధుల నిర్వర్తించడానికి వచ్చిన ఎంపీడీఓ వై.వి.ప్రసాదరావు ఎన్నికల తర్వాత కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. తర్వాత వచ్చిన ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు తొలుత కొనసాగుదామనే వచ్చారు. అయితే స్థానిక కూటమి నేతల ఒత్తిడి తట్టుకోలేక వారం రోజుల్లోనే రణస్థలం మండలానికి వెళ్లిపోయారు. దీంతో నెల రోజుల నుంచి ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉంది.

- ఈఓపీఆర్‌డీగా పనిచేసిన సత్యనారాయణ వారం కిందట అరకు వెళ్లిపోయారు. 20 రోజుల క్రితం సెర్ప్ ఏపీఎంగా విధులు నిర్వహించిన సనపల ప్రసాదరావు కంచిలి మండలానికి వెళ్లిపోగా, ఇంత వరకు ఆ పోస్టులో చేర్పించేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఎంత ప్రయత్నం చేసినా.. ఇచ్ఛాపురం వచ్చేందుకు ఏపీఎంలు విముఖత చూపిస్తుండటంతో ప్రస్తుతం ఆ పోస్టు ఖాళీగానే ఉంది.
- ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు సంబంధించి పంచాయతీరాజ్ డీఈగా పనిచేస్తున్న ఏ.సూర్యప్రకాశరావు మూడు నెలలు క్రితం టెక్కలి ఈఈగా డిప్యూటేషన్‌పై వెళ్లిపోవడంతో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం నిత్యం టెక్కలి పరుగులు తీస్తున్నారు.
- గృహనిర్మాణ శాఖలో కొంత కాలంగా డీఈ పోస్టు ఖాళీగా ఉండగా, ఇక్కడికి వచ్చేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఇదే శాఖలో జేఈగా పనిచేసిన దిలీప్‌రెడ్డి కంచిలి మండలానికి బదిలీపై వెళ్లిపోగా, ఈ పోస్టులో చేరేందుకు సంబంధిత శాఖకు చెందిన ఉద్యోగులు ఇష్టపడక పోవడంతో కేశుపురం గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథంను ఇన్‌చార్జి ఏఈగా నియమించే ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు.
- టి.బరంపురం, మఖండపల్లి, తేలుకుంచి, హరిపురం, కేశుపురం, ఈదుపురం, తులసిగాం, కొఠారీ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లి పోవడంతో ఆ స్థానాల్లో చేరేందుకు ఇతర పంచాయతీ కార్యదర్శులు జంకుతున్నారు.
- వీఆర్వోలది కూడా అదే పరిస్థితి. మండలం, పంచాయతీల్లో ప్రతిపక్షం పార్టీకి చెందిన ఎంపీపీ, జెట్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉండటంతో జీర్ణించుకోలేని కూటమి నేతలు తాము చెప్పినట్లే జరగాలంటూ సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అర్హులైన వారికి సైతం పింఛన్లు తొలగించాలని, గ్రామ స్థాయిలో పనులు జరగాలంటే తాము చెప్పినట్లే జరగాలంటూ ఆదేశాలు జారీ చేస్తుండటం, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌చే సంబంధిత అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో ఇక్కడ పనిచేసేందుకు ఇష్టం లేదని అధికారులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. దీంతో సంబంధిత ఖాళీ పోస్టుల్లో ఇన్‌చార్జీలే దర్శనమిస్తున్నారు.

సమగ్ర చట్టంతోనే కలాసీలకు భద్రత



ర్యాలీ నిర్వహిస్తున్న జట్టు కలాసీ, హమాలీ కార్మిక సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జట్టు కలాసీ హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం తీసుకురావాలని సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జట్టు కలాసీ హమాలీ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా మహాసభలు ఆదివారం శ్రీకాకుళంలో నగరంలో నిర్వహించారు. ముందుగా డైమండ్ పార్క్ నుంచి వైఎస్సార్ కూడలి మీదుగా పాతబస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, కలాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సూరయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఓ ప్రవేటు ఫంక్షన్ హాల్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొల్ల చిన్నారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ జట్టు, ముఠా, కలాసీ కార్మికులు దుర్భర పరిస్థితుల్లో బతుకులీడుస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. హమాలీ, జట్టు, ముఠా, కలాసీ కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, దీని అమలు కోసం వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులతో 50 కిలోలకు మించిన బరువులను మోయించరాదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తీర్మానించిందని గుర్తు చేశారు. అనంతరం కలాసీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సూరయ్య నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి ఎ.మహాలక్ష్మి, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కో–కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఎస్.బలరాం, డి.మహాలక్ష్మి, డి.సూరి, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక:

జట్టు కలాసీ, హమాలీ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులుగా కె.సూరయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.చిన్నారావు, ఆర్.ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా డి.మహాలక్ష్మి, వల్లభరావు, సహాయ కార్యదర్శులుగా కె.లక్ష్మీనారాయణ, డి.సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.సూరి, కోశాధికారిగా పి.అప్పలరాజు, సభ్యులుగా వి.సింహాచలం, ఎల్.పకీరు, ఇ.అప్పారావు, బి.అప్పారావు, ఎ.సతీష్, కె.అప్పన్న, బి.సూరి, ఎ.నర్సయ్య, టి.సుబ్బయ్య, మీనారావు, బి.రామారావు, పోలారావు, రమణ, బి.సహదేవ్, రమేష్, ఎల్.చంద్రయ్య, జోగారావు, తోణంగి. మహేష్, పి.తేజేశ్వరరావు, ఎ.బాబురావు, వీరయ్య, టి.సూర్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు.